# సజా?

సత్యం

మహబూబ్‌అలీ పేరు వెనకా ముందు జంగ్ అని గాని నవాబ్ అనిగాని లేదు

అసలాయన్ని చూశాక్కూడా నాకీ ఆలోచ నొచ్చినందుకు మీరు నన్ను తిట్టకుండా ఉండలేరు.

తెల్లవే అయినా గోధుమ రంగులోకి మారిపోయిన కమీజు, పైజమా, భుజం మీద ఆకుల గంప, మరో భుజం మీద ఎర్ర రుమాలుతో "పాన్ లేప్ పాన్" అంటూ ఆ రెండు మూడు బస్తీల్లో ఎక్కడ పడితే అక్కడే కనిపిస్తాడు.

ఆయన పేరు వెనక ఉన్న ఖాన్ అన్న పదం వాళ్ళ నాన్నతోపాటే పోయింది, అతని చిన్నప్పుడు.

పోనీ అందరూ మహబూబ్ అలీ అని పిలిచినా బాగుండేది. కాని నలుగురి నోట్లో నాని మహబూబ్ అలీ కాస్త మహబెల్లి అయి కూచుంది.

మహబెల్లి వయసిప్పుడు నలభై అయిదు దాటింది. దాటిన వయసుతోపాటే ఆయన పెళ్ళాం "మహబూబ్" "మేరే మహబూబ్" అని ప్రేమగా పిలిచేది కాస్తా ఇప్పుడు ఈసడింపుల్లోకి దిగి అందరిలాగే "మహబెల్లీ" అని అరుస్తుంది.

అది కాస్త బాధగానే ఉన్నా తన సమర్థత కీపాటి గొప్ప చాలులే అని ఊరుకున్నాడు.

> అక్కడే నాకు ఒకటి రెండు సార్లు మహబెల్లి ఆఖరికొడుకులు- అయిదేండ్లవాడు, మూడేండ్ల వాడు- కనిపించారు, ఆ పిప్పిని ఓ బుట్టలో వేసి పిండుతూ.

మహబెల్లి పుట్టి పెరిగింది, ఉండేది హిందువుల బస్తీలోనే. అందుకే అప్పుడప్పుడు హరి కథలకు పురాణాలకు, గుళ్ళో పూజలకు హాజరవుతుండేవాడు.

ఇది నచ్చని వాళ్ళ మిత్రులు "మజబ్ పే దబ్బా లగాతే భే మాదర్ చోత్" (మతానికి మచ్చ తెస్తావ్‌రా) అని తిట్టేవారు.

అంతటితో ఊరుకున్నా సరిపోయేదిగాని సంసారం ఈదలేక మహబెల్లి సంతానాన్ని తగ్గించు కుందామని ఆపరేషను చేయించుకుందామనుకుంటే దానికీ అడ్డు తగిలి "ఖురాన్ కొ ధోకా దేతాబే? జోభీ దేతా హైతో ఖుదాహీ దేతా ఔర్ ఉసేహీ లేజాతా! యే అదర్ బీచ్ కామా నైకర్నా" (ఖురాన్‌ను మోసం చేస్తావా? ఏమిచ్చినా. తీస్కపోయినా దేవుడే తీస్కపోతాడు, ఇస్తడు కూడా, నడమంత్రపు పనులు చెయ్యొద్దు) అని బెదిరించాడు.

దాంతో ఆయన సంతానం నాలుగు నుండి ఆరుకి పెరిగింది.

ఆకులమ్మే మహబెల్లి సంపాదన ఎంతో ఎవరికి తెలియదు గనుక! అందుకే ఆయన వంశోద్ధారకులంతా వీధుల్లోనే పెరుగుతున్నారు. అరడజను అయ్యాక అతడికి అంతా తెలిసొచ్చింది. చివరకు తెగించి ఆపరేషను చేయించుకున్నాడు.

వీధుల్లో ఎదిగిన పెద్దకుర్రాడు ఐస్ ఫ్రూట్ బండి ఒకటి తీసుకొని జీవనరణరంగంలోకి దూకాడు.

సంపాదన మొదలెట్టగానె సంసారంలోని లోటు పాట్లన్ని భూతద్దంలోంచి దయ్యాల్లా భయపెట్టసాగాయి. వాటి పీడా వదిలించుకుందామని ఇల్లు వదలి పెట్టేశాడు.

మహబెల్లి మాత్రం వేదాంతిలా నిర్లిప్తంలోకి జారిపోయాడు.

ఇది తెలిసిన ఆయన మిత్రులు "దేఖారే! ఐసా గలత్ కామా కరేతో ఖుదా చుప్‌నహీ రహ్తా! ఉస్ పాప్‌కా సబక్ జరూర్ మిల్తా ఔర్ మిల్ భీగయా!" (సూసినావ్! ఇట్ల తప్పుడు పనులు సేస్తె దేవుడూర్కోడు ఆ పాపపు పనికి పాయశ్చిత్తం తప్పకయితది; అయింది గూడ) అని వెక్కిరించారు.

ఇంతటితో ఆగిపోయినా బాగుండేది కాని ఇంకో సంఘటన జరిగింది.

వీళ్ళుండే పేటకు కొద్దిదూరంలోనే ఓ ఇరానీ హోటలుండేది.

అలవాటయిందా, మద్యాన్నయినా మానొచ్చుగాని ఇరానీచాయ్‌ని వదలడం కష్టం.

అందుకు తగ్గట్టుగానె ఇరానీ హోటలెప్పుడూ కిటకిటలాడేది జనంతో.

వ్యాపారపు లావాదేవీలు, బస్తీ మీటింగుల ఎజెండాలు, చిన్న లీడర్ల ప్రచార యంత్రాంగం ఎప్పుడూ అక్కడే కొనసాగుతాయి.

వీళ్ళతోపాటే మేమేం తక్కువ అన్నట్లు ఆ ఏరియా ఉర్దూకవులు హోటల్లోని ఓ మూల బల్ల దగ్గర కూర్చొనే

"లగీ చాయెకి షర్త్"

సిగరెట్ ముజేదో

మైతుమే దువా ధూంగా" లాంటి షాహిరీలు అల్లేసే వారు.

హోటల్ కిచన్‌లో మాత్రం తుమ్మ మొద్దుల మంటపై కేవలం డికాషన్ కుత కుత ఉడుకుతుంటుంది శ్రమజీవి రక్తంలా. అప్పుడప్పుడు సమోసాలు, తందూరీ రోటీలు తయారవుతున్నా చాయ్‌కున్న గిరాకీ దేనికీ ఉండదు.

ఒక్క చాయ్ తాగి గంటలకొద్దీ క్విజ్‌లు, రేస్‌టిప్పులు ఆలోచించే వాళ్లెప్పుడూ అక్కడికే వస్తారు.

కిచన్‌లోని డికాషన్‌లా హోటల్ కస్టమర్స్ మస్తిష్కం కూడా ఉడికిపోతుంటుంది.

ఎప్పటి కప్పుడు తేయాకు మార్చే అలవాటు వాళ్లకున్నట్టు లేదు, పైగా వాళ్ళవాడే తేయాకు స్పెషల్. ఏదో ఆకు పొడి దాంట్లో కలుపుతారట.

దినమంతా వాడిన తేయాకు పిప్పిని తెల్లారే దూరంగా ఉన్న మునిసిపాలిటీ చెత్త కుండీ దగ్గర పారవేస్తారు.

అక్కడే నాకు ఒకటి రెండు సార్లు మహబెల్లి ఆఖరి కొడుకులు- అయిదేండ్లవాడు మూడేండ్లవాడు- కనిపించారు, ఆ పిప్పిని ఓ బుట్టలో వేసి పిండుతూ.

ఆకులమ్మే మహబెల్లి తన పిల్లలకు రోజూ "టీ" ఎలా ఇవ్వగలడు? ఏదో పండగకో, ఏ పబ్బానికో పరమాన్నంలా టీ పెట్టుకుంటారు, వాళ్లింట్లో రోజూ తాగేది గంజినీళ్లే

చెత్తకుండీ దగ్గర పందులు నాకే ఆ టీ పొడిని వాళ్లట్లా పిండడం, వచ్చిన కొన్ని చుక్కలు నోట్లోపోసుకోవడం తరవాత ఆ గసిని జేబులో వేసుకోవడం క్షణాల్లో జరిగిపోయేది.

భరించలేక ఓసారి బెదిరించాను వాళ్ళను. దానికి వాళ్ళు నవ్వి "నీకు తెలవదన్నా, దీంట్లె ఏం మజా ఉంటదో, మంచి నిషా వస్తది" అని వెళ్ళి పోయారు.

నిషా......నా చెవుల్లో గింగురు మంది.

అవును నిషా అవసరం లేంది ఎవరికి ? ప్రతి ఒక్కడికి ఏదో నిషా కావాలి.

కాని కేవలం టీ తాగలేని మహబెల్లి కొడుకులు పందులు నాకిన టీ పొడిని....... గుండె బాధతో మూలిగింది.

ఎంత చెప్పినా విన్పించుకోలేదు వాళ్ళు.

ఓ రోజు ఆ కుర్రాళ్ళిద్దరూ నురగలు కక్కుతుంటే ఆస్పత్రికి తీసుకెళ్తున్నారు, దార్లోనె నురగలు ఆగి పోయాయి. నురగలతోపాటె నడుస్తున్న నాడులు నిలిచి పోయాయి.

చల్లబడ్డ ఒళ్ళతో మహబెల్లిఆ చెత్త కుండి దగ్గర తడుముతున్నాడు, కొద్దిగా దూరంలో చితికిపోయిన బల్లి తల కన్పించింది. లోకమంతా చీకటిగా మారిపోయింది మహబెల్లికి.

"గలతీకా సజా తుఝే మిల్‌గయా"

దూరంగా గుంపులోంచి ఎవడో అన్నాడు.

మీరూ మీ పరివారం

ప్రజాతంత్ర

చదవండి వారం వారం